
ఉష్ణోగ్రత గురువారం గరిష్టం : 27.0 కనిష్టం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 5 డిసెంబరు 2025

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. హెచ్చెల్సీ ఆయకట్టు కింద రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలులో చిన్న, సన్నకారు రైతులకే తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గత వైసీపీ పాలనలో ఖరీఫ్ సీజన్‌లో 5 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వరి కొనుగోలు చేసి, హంగామా చేసేవారన్నారు. ఈ ఏడాది రైతుల నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనిని బట్టి చూస్తే రైతులపై ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. రైతులు కూడా దళారులకు పంటను విక్రయించి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. క్వింటాలు ధాన్యం ధర రూ.2389గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తమది అసలైన రైతు ప్రభుత్వమని ఆయన ఉద్ఘాటించారు.

రేపు అంబేడ్కర్ వర్ధంతి

అనంతపురం విద్య, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని జడ్పీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించి, నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నమో.. నీలకంఠా..

ఘనంగా నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం

డీ.హీరేహాళ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శివనామ స్మరణ నడుమ రథాన్ని లాడారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు →

కాలువకు ఊపిరి..!

- పీఏబీఆర్ కుడి కాలువకు సీబీఆర్ నీరు
- లిఫ్ట్ ఏర్పాటుకు అడుగులు
- పాత డీపీఆర్‌ను పరిశీలించనున్న అధికారులు
- పూర్తయితే బత్తలపల్లి, తాడిమర్రి మండలాల కరువు తీరినట్లే..



పీఏబీఆర్ కుడికాలువ

తాడిమర్రి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలంలో పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడికాలువ ఉంది. కాలువ చివరి ప్రాంతం కావడంతో ఏటా నీరు అరకొరగానే అందుతోంది. పట్టుమని పక్షం రోజులు కూడా నీరు వదలరు. దీంతో ఆయకట్టు సంగతి దేవుడెరుగు.. తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. టీడీపీ హయాంలో కాలువకు నీరిచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించారు. తాడిమర్రి (మిగతా 6లో..)

అనంతపురం పాతూరు మార్కెట్‌లో సరుకులు, కూరగాయలు, పూలు, పండ్లు జిల్లాలోకెల్లా తక్కువ ధరలు, నాణ్యతగా ఉంటాయన్నది ప్రజల నమ్మకం. అందుకే వ్యయ ప్రయాసలకోర్చి మార్కెట్‌కే వెళ్తారు. ఇటీవలిగా పరిస్థితులు మారాయి. బయట కంటే మార్కెట్‌లో ధరలు అధికంగా ఉంటుండడంతో జనం షాక్ అవుతున్నారు. నాణ్యత కూడా అంతంతమాత్రమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదేంటని జనం నిలదీస్తున్నారు కూడా. ఇందుకు కారణం మార్కెట్‌లో మాఫియా ఏర్పడడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. వ్యాపారుల్లో కొందరు మాఫియాగా ఏర్పడి, ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధిక ధరలతో ప్రజలను దోచుకుతింటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. నగర పాలక సంస్థ దుకాణాల అద్దెలు కూడా ఎగ్గొడుతున్నారని ఆ వర్గాలు వాపోతున్నాయి.



పాతూరు మార్కెట్

మార్కెట్లో మాఫియా..!

ఇష్టారాజ్యంగా ధరల నిర్ణయం



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పూలు, నిత్యావసర సరుకులు, పండ్ల ధరలు తక్కువగా ఉన్నా.. పాతూరులో మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. దళారీ మాఫియా పాతూరులో పాతుకుపోయి ప్రజలపై పడి రాబందుల్లా పీక్కుతింటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చోటామోటా నాయకులుగా చలామణీ అవుతున్న దళారీలు సిండికేట్‌గా ఏర్పడి, అడ్డగోలుగా దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారి ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. పలుమార్లు 'బయట బజారులో తక్కువ ధరకే పూలు, పండ్లు దొరుకుతున్నా.. మార్కెట్‌లో (మిగతా 6లో..)

బయట కంటే ఎక్కువే..


ప్రజలను దోచుకుంటున్న వైనం

కళ్లు మూసుకున్న అధికారులు



అనంత అరటి రైతులను ఆదుకోండి

- ముంబై, ఢిల్లీకి కార్గో ట్రైన్లు నడపాలి
- లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం క్రైం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ధరలు కుప్పకూలి తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనంత అరటి రైతులను ఆదుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. లోక్‌సభలో గురువారం ఆయన అనంత రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ప్రస్తావించారు. ఏపీ ఉద్యానవనరంగానికి అనంతపురం గుండెకాయ వంటిదన్నారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో కలిపి 40 వేల హెక్టార్లకుపైగా సాగవుతోందన్నారు. ఈ సీజన్‌లో అరటి ధరలు పూర్తిగా తగ్గాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన పంట సాగవుతున్నా.. జాతీయ మార్కెట్లలో పోటీ పడలేకపోతున్నారన్నారు. దీనికి భారతీయ రైల్వే శాఖ అధిక రీఫర్ కంటైనర్ చార్జీలు విధించడమేనన్నారు. శీతలీకరణ రవాణా రైతులకు అధిక వ్యయంగా, భారంగా మారుతోందన్నారు. కేంద్రం తక్షణ చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు తక్షణ ఆర్థికసాయం అందించాలన్నారు. ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన వినియోగకేంద్రాలకు అరటిని రవాణా చేసేందుకు ప్రత్యేక కార్గో రైళ్లు నడపాలన్నారు. ఈ మేరకు ఆయన కేంద్రాన్ని కోరారు.

పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

- అసెస్‌మెంట్ నంబరుతో లింకుపెట్టిన ప్రభుత్వం
- ఖాళీస్థలాలకూ ఇక పన్ను తప్పనిసరి
- మున్సిపాల్టీలు, నగరపంచాయతీలకు వర్తింపు

7

డ్రగ్స్, గంజాయిని అరికట్టాలి

- కలెక్టర్ ఆనంద్

సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మాదక ద్రవ్యాలు, గంజాయి నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి ఎన్కోఆర్డ్(నార్కో కోఆర్డినేషన్ సెంటర్)జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ జగదీష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని జూనియర్ కళాశాలు, యూనివర్సిటీల్లో ఇప్పటికే ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామన్నారు. వీటితో కలిసి అన్ని చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వలిబాషా గంజాయి కేసుల గురించి వివరించారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ రాజగోపాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డీఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై దృష్టి పెట్టండి

జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతపురం లో గుర్తించిన 23 పార్కింగ్ ప్రాంతాలను వచ్చే నెలలోపు అందుబాటులోకి తేవాలన్నారు. నగరంలో 100 ప్రైవేట్ పార్కింగ్ లొకేషన్‌లను గుర్తించాలని, వచ్చే సమావేశం నాటికి సగం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో మరింత పురోగతి తీసుకురావాలన్నారు. రాప్తాడు రైల్వే ఓవర్ బ్రిడ్జిని రెండు వారాల్లో ప్రారంభించి, వాహనాలను అనుమతించాలన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. చలానాలు మరింత పెంచాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, నేషనల్ హైవే పీడీ తరుణ్, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, నగరపాలిక డీసీ పావని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై మహిళా కమిషన్

సీరియస్

సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం (7లో)

డిగ్రీ పరీక్షల్లో

17 మంది డిబార్

(7లో...)

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడాపోటీలు (7లో)

నేడు మెగా పీటీఎం

- 1,752 విద్యాలయాల్లో వేడుకలు
- నిర్వహణకు నిధులు విడుదల
- ముస్తాబైన పాఠశాలలు, కళాశాలలు
- హాజరుకానున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీట్) నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో 1752 పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందులో 1249 ప్రాథమిక పాఠశాలలు, 59 ప్రాథమికోన్నత పాఠశాలలు, 419 ఉన్నత పాఠశాలలు, 28 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,92,484మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులను మెగా పీటీఎంకు ఇప్పటికే ఆహ్వానించారు. మెగా పీటీఎం 3.0 నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ49.82లక్షలు సమగ్రశిక్ష ద్వారా నిధులు మంజూరు చేశారని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ తెలిపారు.

హాజరుకానున్న కలెక్టరు, ప్రజాప్రతినిధులు

మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. మంత్రి కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి అందుబాటులో లేకపోవడంతో ఈ కార్యక్రమానికి హాజరుకావడంలేదు. కలెక్టరు ఆత్మకూరు జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ విప్ ఉద్దేహాళ్ జడ్పీ హైస్కూల్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సిండికేట్‌నగర్ జడ్పీ హైస్కూల్, శింగనమల ఎమ్మెల్యే కొర్రపాడు గురుకులపాఠశాల, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీఅశ్మిత్‌రెడ్డి పెద్దవడుగూరు జడ్పీ హైస్కూల్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అక్కడి ఏపీ మోడల్‌స్కూల్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ గుత్తి బాలికల జడ్పీ హైస్కూల్‌లో జరిగే వేడకల్లో పాల్గొననున్నారు. వీరితో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మెన్లు, ఉన్నతాధికారులు వివిధ పాఠశాలల్లో పాల్గొననున్నారు. వేడుకల విజయవంతానికి డీఈఓ, ఏపీసీ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షిస్తున్నారు.



మెగా పీటీఎంకు ఏర్పాటు చేసిన వేదిక

విచ్చలవిడిగా గంజాయి

- మత్తులో జోగుతున్న పల్లెలు
- రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- పట్టించుకోని పోలీసులు





హిందూపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పోలీసులు పట్టించుకపోవడంతో గంజా యి బ్యాచ్ రెచ్చిపోయి గొడవలకు దిగుతోంది. పట్టణాల్లోనే కాకుండా పల్లెలకు కూడా గంజాయి మత్తు పాకుతోంది. చాలా మంది విద్యార్థులు, యువత దీనికి అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మరికొంత మంది యువకులు దాడులకు దిగుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి పెనుకొండ, సోమందేపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనిని తీసుకున్న యువత మత్తులో ఏమి చేస్తున్నారో తెలియక విచక్షణ కోల్పోతోంది.

మచ్చుకు కొన్ని..

ఏడాది క్రితం సోమందేపల్లిలోని మార్కెట్ రోడ్డులో గంజాయి మత్తులో యువకులు కత్తులతో దాడులు చేసుకున్నారు. వారు ఎందుకు దాడులు చేసుకున్నారో తెలియక అక్కడ ఉన్న జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. తరువాత ఆ యువకులు గంజాయి సేవించినట్లు తెలిసింది. ఇదే గ్రామంలోని గీతా నగర్‌లో ఓ ఉద్యోగి కుటుంబంపై గంజాయి మత్తులో ఉన్న యువకులు దాడులకు పాల్పడ్డారు. కొద్ది నెలల క్రితం సోమందేపల్లిలో అర్ధరాత్రి బైక్‌పై వెళుతూ మత్తులో కిందపడి ఒకరు మృతి చెందారు. నక్కలగుట్ట సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై (మిగతా 6వ పేజీలో.)

రికార్డులు గల్లంతు...!



- తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపించని పాత ఫైళ్లు
- వెతక్కుండానే తిప్పి పంపుతున్న సిబ్బంది
- రెవెన్యూ రికార్డుల కోసం ప్రజల కష్టాలు



కూడేరు తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల కోసం రైతులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. భూమికి సంబంధించి ఏదైనా పాత రికార్డులు తెచ్చుకోవాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రతి భూమికి సంబంధించిన రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో తప్పనిసరిగా ఉండాలి. అది అసైన్డ్ భూమా, చుక్కల భూమా, దేవదాయ శాఖ భూముల వివరాలతో పాటు ప్రైవేట్ భూమి అయితే సంబంధిత డైక్లాట్ వివరాలు, గతంలో సబ్ డివిజన్ జరిగి ఉంటే వాటికి సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలి. కొన్ని భూములకు సంబంధించిన రికార్డులు సంబంధిత డివిజన్‌కు చెందిన ఆర్డీఓ కార్యాలయంలోనూ ఉండాలి. ప్రతి భూమికి తప్పనిసరిగా..1బీ, అడంగల్, స్కెచ్, ప్లాన్, 8ఏ, 10వన్ ఫైల్స్ అవసరం. కానీ ప్రజలకు ఆ రికార్డులు ఏమీ లేనట్లు చెబుతున్నారు. ఉన్నవాటిని వెతికి పెట్టడానికి నెలల తరబడి తిప్పుకుంటున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. లేదంటే పైసలు ముట్టజెబితే (మిగతా 6వ పేజీలో...)

డీడీఓ కార్యాలయాలు ప్రారంభం



అనంతపురం డీడీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీడీఓ (డివిజనల్ అభివృద్ధి అధికారి) కార్యాలయాలను గురువారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న అనంతపురం రూరల్ సచివాలయం-2లో డీడీఓ కార్యాలయంతోపాటు గుంతకల్లు, కళ్యాణదుర్గంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. అనంతపురంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించారు. ప్రజల చెంతకే సేవలందించడంలో భాగంగానే డీడీఓ వ్యవస్థను అమలు చేస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చ్యువల్‌గా ప్రారంభించినా.. అనంతపురంలో డీడీఓ నాగశివలీల కార్యక్రమం ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు, డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఎంపీడీఓలు దివాకర్, విజయలక్ష్మి, రత్నాబాయి, భాస్కర్, లక్ష్మీనరసింహ, కుళ్లాయప్ప, బాబావలి, మమత, చలపతి, ఏపీడీ చెన్నకేశవులు, పీఆర్ సబ్‌డివిజన్-1 డీఈ లక్ష్మీనారాయణ, ఏఈఈ వెంకటశేషయ్య పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ

పోరుడి చెంతకే పోలీసు...!

- బాధితుల్లో భరోసా నింపేందుకు ఇళ్ల వద్దకు ఫోన్లు
- 'మీ మొబైల్ మీ ఇంటికి' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ జగదీష్
- రూ.2.13 కోట్ల విలువైన 1,025 ఫోన్లు అందజేత



యజమానికి సెల్‌ఫోన్ అందిస్తున్న పోలీసు ←

అనంతపురం క్రైం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లి వారిలో భరోసా నింపేందుకు 'మీ మొబైల్ మీ ఇంటికి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 42 పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితులకు ఫోన్లను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలు పోగొట్టుకున్న ఫోన్లపై ప్రజలు చాట్‌బాట్‌గానీ, సీఈఐఆర్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఐఎంఈఐ ఆధారిత ట్రాకింగ్, టెక్నికల్ పరిశోధన, సైబర్ విభాగం సహకారంతో ఫోన్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజల భద్రతతోపాటు, వారి ఆస్తి రక్షణ కూడా పోలీసుల బాధ్యత అన్నారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా రూ.2.13 కోట్ల విలువైన 1,025 ఫోన్లను పోగొట్టుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. విలేజ్ పోలీసు అధికారులు, ఆయా స్టేషన్ల ఎస్ఐలు వెళ్లి అందించారు. ఇప్పటి వరకూ జిల్లాలో 26.24 కోట్ల విలువైన 13,619 ఫోన్లు జిల్లా పోలీసులు రికవరీ చేసి, బాధితులకు అందించారు.

కాకర.. తీపి..!

- ఆశాజనకంగా ధరలు
- కిలో రూ.50 పలుకుతున్న వైనం
- అన్నదాతకు లాభాలు



చిన్నపల్లి వద్ద సాగుచేసిన కాకర పంట



దిగుబడి, ధరలు బాగుండడంతో లాభాలు

తనకల్లు మండలంలో 40 ఎకరాల భూములు కొనుగోలు చేశా. మరో 80 ఎకరాలు లీజుకు తీసుకుని, పలు పంటలు సాగు చేస్తున్నా. ఈప్రాంత భూములు కూరగాయలు, పండ్లతోటల సాగుకు అనుకూలం. కాకర మొట్టమొదటి సారి సాగుచేశా. దిగుబడి, ధరలు బాగుండడంతో లాభాలు వస్తున్నాయి.

- రామలింగరాజు, కాకినాడ



తనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేదైన కాకర తియ్యటి లాభాలు పంచుతోంది. మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా పలుకుతుండడంతో అన్నదాతకు లాభాల పంట పండుతోంది. కిలో రూ.50 వరకు అమ్ముడవుతున్నాయి. మండలంలో ఏడాది పొడవునా కూరగాయ పంటలు సాగుచేసి, బెంగళూరు, చెన్నై మార్కెట్లకు తరలిస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రబీ ప్రారంభం వరకు కూరగాయలు సాగుచేసిన రైతులు నష్టాలబాట పట్టారు. ధరలులేక ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు అడిగిన రేటుకి ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొన్నిరోజులుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. కాకరకు ఉన్నట్లుండి ధరలు పెరిగాయి. దీంతో అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మందులు అవసరంలేని పంట

కాకినాడకు చెందిన రామలింగరాజు తనకల్లు మండలంలోని చిన్నపల్లి వద్ద రెండెకరాలు లీజుకు తీసుకుని, కాకర సాగుచేశాడు. ఎకరాకి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టాడు. దిగుబడి ఆశాజనకంగా ఉంది. ధరలు కూడా బాగున్నాయి. రైతు వినూత్నంగా ఆలోచించి కాకర కాయలను బాక్సుల్లో నింపి తరలిస్తున్నారు. సాధారణంగా కాకరను సంచుల్లో వేసుకుని, మార్కెట్‌కు తరలిస్తున్నారు. తాజాగా కనిపించక ధర పెద్దగా దక్కదని రైతు అభిప్రాయపడుతున్నారు. బాక్సుల్లో వేసుకుని తరలిస్తే.. తాజాగా ఉంటూ మంచి ధరకు అమ్ముడవుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లలో కాకర కిలో రూ.50 వరకు ధర పలుకుతోంది. కాకర వారానికో కోత పడుతోంది. ప్రతి కోతకు 2 టన్నుల దాకా దిగుబడి వస్తోంది. ఈ లెక్కన రూ.లక్ష వరకు రైతుకు ఆదాయం సమకూరుతోంది. ఇలా.. 30 కోతలు పడతాయని రైతు చెబుతున్నారు. ధరలు ఇలాగే ఉంటే.. రూ.30 లక్షల వరకు లాభం వస్తుందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటకు పెద్దగా పురుగు మందులు కూడా అవసరంలేదు. దోమ నివారణకు పురుగు మందులు పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. టమోటా పంటతో పోల్చితే పురుగు మందుల అవసరం తక్కువే. ఆరోగ్యానికి కాకర కాయ ఎంతోమంచిదని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం నియంత్రణలో ఉండడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు.



కాకరకాయలను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు

రికార్డులు గల్లంతు...!

(5వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉన్నవి అందజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమకు కావాల్సిన రెవెన్యూ రికార్డుల కోసం వివిధ వర్గాల ప్రజలు, రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

ఎన్నాళ్లు అడుక్కోవాలి..?

● గార్లదిన్నె మండలం జంబులదిన్నెలో రీ సర్వే పూర్తయింది. కొన్ని భూములు జాయింట్ ఎల్‌పీఎం కింద పెట్టడంతో రిజిస్ట్రేషన్ చేసుకోలేక సంబంధిత రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆ గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి సర్వేనెంబరు-37కు చెందిన ఐదెకరాల భూమికి సంబంధించి గతంలో జరిగిన సబ్‌డివిజన్ కాపీ 8ఏ, 10వన్ కాపీల కోసం గత ఆరునెలలుగా తిరుగుతున్నాడు. కానీ తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆ రికార్డుల్లేవంటూ తిప్పి పంపుతున్నారు. తరచూ పై అధికారులకు ఫిర్యాదు చేయడంతో చివరకు 10వన్ కాపీ ఇచ్చారు. ఇక 8ఏ కాపీ మాత్రం లేదంటున్నారు. ఆ ఫైల్ ఆర్డీఓ కార్యాలయంలోనూ లేదని చెబుతుండటం గమనార్హం. ఇదే గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో కొందరు రెవెన్యూ రికార్డుల కోసం తిరుగుతున్నా లేవనే చెబుతున్నట్లు సమాచారం.

● ఆత్మకూరు మండలం వడ్డుపల్లి పరిధిలో ఓ వ్యక్తి 40సెంట్లు కొనుగోలు చేశారు. లీగల్ ఒపీనియన్ కోసం గతంలో జరిగిన సబ్ డివిజన్‌కు సంబంధించి 8ఏ ఫైల్ కావాలని కోరారు. అయితే ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆ ఫైల్ లేదని చెప్పారట. అప్పట్లో కాలిపోయిందని, అవి దొరకవని, పాత ఫైల్ కదా ! అవి ఇంకా ఎక్కడుంటాయని సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఆ ఫైల్ ఆర్డీఓ ఆఫీస్ లోనూ లేదని చెప్పారు.

● జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు డివిజన్ల పరిధిలో 32 మండలాలున్నాయి. వీటిలో దాదాపు 20 నుంచి 25 మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి మండలంలోనూ భూములకు సంబంధించి 1బీ, అడంగల్, స్కెచ్, ప్లాన్ 8ఏ, 10వన్ కావాలంటే రూ.వెయ్యిల నుంచి రూ.5వేల వరకు ఫైల్‌ను బట్టి పైసలు పుచ్చుకుంటున్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి.



ఆ రెండు ఫైళ్లు ఎక్కడ..?

ఏ భూమికైనా గతంలో జరిగిన సబ్ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆ వివరాలు 8ఏ కాపీలో అందజేస్తారు. కానీ కొన్ని చోట్ల ఆ పత్రాలు కనిపించడం లేదు. బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి సమీపంలో 544 డీ హైవే రోడ్డు పనులు జరుగుతుండటంతో ఆ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం గోవిందంపల్లి భూములు ఎకరం రూ.కోటికి పైగా పలుకుతున్నాయి. వీటికి సంబంధించిన 8ఏ, 10వన్ ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయంలో కనిపించడం లేదని తెలిసింది. ఇక్కడ కొందరు ఘనులు ఆ ఫైళ్లను అమ్మేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ భూములకు ధరలు భారీగా పలకడంతో భూమాయ కోసం వాటిని అమ్మేశారనే విమర్శలున్నాయి. కొందరు సమాచార హక్కు చట్టం మేరకు అడిగినా లేవంటూ రాసిచ్చారట. చివరకు జిల్లా కలెక్టర్‌కు అడిగినా దిక్కు లేకుండా పోయిందని వాటి కోసం వెతికుతున్నవారు చెబుతున్నారు.

దగ్ధం అయ్యాయనే సాకు...

రెవెన్యూ రికార్డుల్లో 1బీ, అడంగల్ త్వరగా వెతికి ఇచ్చే పత్రాలు. అవి ఇవ్వడానికి కూడా రోజుల తరబడి తిప్పుతున్నారు. డబ్బులు ఇస్తే మాత్రం త్వరగా అందజేస్తున్నారు. రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు మండలాల్లో ఏ రికార్డు కోసం పోయినా లేవని చెబుతుంటారు. ఎప్పుడో కాలిపోయిన చరిత్ర గురించి వల్లెవేస్తూ, ఏమీ లేవండి అన్నీ కాలిపోయాయంటున్నారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయాన్ని మూడు దశాబ్దాల కిందట కాల్చివేశారు. ఆ సమయంలో ఎన్ని ఫైళ్లు దగ్ధమయ్యాయో, ఎన్ని మిగిలాయో తెలియదు కానీ అప్పట్లో జరిగిన సబ్ డివిజన్ కాపీలతో పాటు చాలా రికార్డులు లేవంటుంటారు. ఇక కూడేరు తహసీల్దార్ కార్యాలయం 1995-96లో నక్సలైట్లు కాల్చివేశారు. అప్పట్లో రికార్డు రూమ్ కాలిపోలేదని సమాచారం. పాత రికార్డుల కోసం అడిగితే చాలు లేవని సమాధానం చెబుతారు. ఆ ముసుగులో కొన్ని కాల్చివేశారు, అమ్మివేశారనే ఆరోపణలున్నాయి. ఆ మండలంలో లెక్కలేనన్ని వివాద భూములున్నాయి. నకిలీ ఎన్ఓసీలు సైతం పుట్టించారు. ఇక రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో 2016లో మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి హత్య జరిగిన సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి నిప్పంటించారు. ఆ సమయంలో చాలా వరకు ఫైళ్లు కాలిపోయాయి. కానీ పాత రికార్డుల కోసం అడిగితే చాలా వరకు లేవనే చెబుతున్నారు. దీంతో ఆ మూడు మండలాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో క్లాక్‌టవర్ సమీపం నుంచి డీఆర్‌డీఏ కార్యాలయ భవన సముదాయంలోకి మార్చారు. అప్పట్లో డివిజన్ పరిధిలో 19 మండలాలుండేవి. ఇప్పుడు 13మండలాలున్నాయి. మార్చిన సమయంలో కొన్ని రికార్డులు మాయమయ్యాయో లేక మతలబు చేశారో తెలియదు కానీ ఎన్నో రికార్డులు లేవని చెబుతుంటారు.

రికార్డ్ అసిస్టెంట్ పోస్టేదీ..?

తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులకు భద్రత లేకుండా పోయింది. కొన్నేళ్ల క్రితం రికార్డు అసిస్టెంట్ అనే ఉద్యోగి వాటిని పర్యవేక్షిస్తుండేవాడు. కానీ ఇప్పుడు ఆ పోస్టు ఏ తహసీల్దార్ కార్యాలయంలోనూ లేదు. జూనియర్ అసిస్టెంట్లో, అటెండర్లో వాటిని చూస్తుంటారు. దీంతో వాటిని పర్యవేక్షించే నాథుడే లేకపోవడంతో ఆ ఫైళ్లు మాయమవడం, తిరకాసులు జరగడం సర్వసాధారణమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రికార్డులు లేవనడం సరికాదు

భూములకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు లేవనడం సరికాదు. ప్రతి రికార్డు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంతో పాటు సర్వే శాఖ ఏడీ కార్యాలయంలో ఉండాలి. గడువు తీసుకున్నా రికార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. సబ్ డివిజన్‌కు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిందే. రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కొన్ని రికార్డులు కాలిపోయాయి. కలెక్టర్‌తో చర్చించి రికార్డుల విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం.

- శివనారాయణ శర్మ, జాయింట్ కలెక్టర్

కాలువకు ఊపిరి..!

(5వ పేజీ తరువాయి)

మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలువకు నీరివ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. పనులు పూర్తయితే నీటి కష్టాలు తీరుతాయని తాడిమర్రి, బత్తలపల్లి మండలాల ప్రజలు సంతోషించారు. టెండర్లకు వెళ్లే దశలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో జనం ఆశలు అడియాసలయ్యాయి. ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ఐదేళ్లూ అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎత్తిపోతల పథకం మళ్లీ తెరపైకి వచ్చింది. పనులు చేపట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్తగా డీపీఆర్ తయారు చేసి, ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కుడి కాలువకు ఊపిరి పోసినట్లే.

సాగులోకి రానున్న 20 వేల ఎకరాలు..

తాడిమర్రి మండలంలోని సీబీఆర్ నీటిని మరువపల్లి సరిహద్దు ప్రాంతాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పీఏబీఆర్ కుడికాలువకు తరలించనున్నారు. దాదాపు 14 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటుచేసి మన్నీల వద్ద పీఏబీఆర్ కుడికాలువలోకి కలపనున్నారు. తద్వారా బత్తలపల్లి మండలంలోని అప్రాచెరువు, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, ఎం చెర్లోపల్లి, బత్తలపల్లి, మాల్యవంతం, తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి, పుల్లప్పల్లి, పిన్నదరి, పుల్లానారాయణపల్లి, భీమరాయనిపేట, తాడిమర్రి, మద్దలచెరువు, నిడిగల్లు, నారసింపల్లి, మేడమాకులపల్లి, మరువపల్లి, అగ్రహారం, ఆత్మకూరు గ్రామాలకు తాగు, సాగునీరు అందించవచ్చు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును 2017లో అప్పటి అధికారులు తయారుచేశారు. భూసేకరణ అవసరంలేదనీ, కుడికాలువ వెంబడే పైపులైన్ కూడా ఏర్పాటుచేయవచ్చని తేల్చారు. అందుకు ఆమోదం లభించేలోపే ఎన్నికలొచ్చాయి. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు.. ఆ ప్రాజెక్టును అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు సంబంధించి సాగు, తాగునీరు అందించే ప్రాజెక్టులలో పెండింగ్ ఉన్న వాటి గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. అందులో పీఏబీఆర్ పొడిగింపు కాలువ, ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సంబంధించిన ఫైళ్లకు దుమ్ముదులుపుతున్నారు. అందులో భాగంగానే లిఫ్ట్ ఏర్పాటుకు పాలకుల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు తెలిసింది. ఏర్పాటైతే తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు సంబంధించి దాదాపు 20వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చే అవకాశం ఉంది. తాగునీటి సమస్య కూడా తీరనుంది. ఇప్పటికే మండలంలో బారీస్థాయిలో సాగవుతున్న చీనీ, అరటి, దానిమ్మ పంటలకు తోడు వరి, వేరుశనగ, మొక్కజొన్న లాంటి పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది.

బంగారు పంటలు పండిస్తాం..



అరకొర నీటితోనే నాణ్యమైన పంటలు పండిస్తున్నాం. పూర్తిస్థాయిలో నీరిస్తే బంగారు పంటలు పండించగలం. సాగునీటి కష్టాలు తీరనుండడం ఆనందంగా ఉంది.

-రామచంద్రారెడ్డి, రైతు, శివంపల్లి

రూ.30 కోట్లతో వేదవతిపై వంతెన

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అమిలినేని



కన్నెపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

బ్రహ్మసముద్రం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలం కన్నెపల్లి నుంచి భూపసముద్రం వరకు నాబార్డు నిధులు రూ. 30 కోట్లతో వేదవతినదిపై వంతెన, తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కన్నెపల్లి గ్రామంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణం టెండర్ల కోసం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తనకు తెలిసిన ఒక పెద్ద కాంట్రాక్టర్‌ను ఒప్పించానని, యేడాదిన్నర లోపు దీన్ని నిర్మించి.. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాలల్లో అసంపూర్తిగా పనులను వదిలేసిందని, వాటిని దాతల సహకారంతో పూర్తి చేస్తామని చెప్పారు. కన్నెపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాన్ని యేడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 39 రోడ్లు మంజూరైతే.. అందులో మన నియోజకవర్గానివే 24 ఉన్నాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి కేసులు మాఫీ కోసం ఢిల్లీకి విమానాల్లో తిరిగేందుకే రూ.222 కోట్లు ఖర్చు చేశాడన్నారు. నియోజకవర్గంలోని 72 పంచాయతీల్లో ఫ్రీజర్ శవపేటికలను, ప్రతి మండలకేంద్రానికి ఒకటి ఒక వ్యాన్‌ను సొంత నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాక్టర్ బోల్తాపడి గాయ పడి.. బెంగళూరులో చికిత్స పొందుతున్న ఇద్దరు కూలీలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్‌వోసీని మూడు రోజుల్లోగా తెప్పించామని, అందులో అనసూయమ్మకు రూ. ఆరు లక్షలు, మరొకరికి రూ.4 లక్షలు వచ్చిందన్నారు. బీటీపీతో పాటు 114 చెరువులకు నీళ్లు ఇచ్చి ప్రజల వద్దకు వెళతామన్నారు.

పరోపకారి..!



రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేస్తున్న దామోదర్ రెడ్డి

ఇది పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు. ఇటీవలే కొత్తగా రోడ్డు వేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆ దారిలోని కొండాపురం మలుపు వద్ద కాలువ పైప్‌లైన్ పగిలింది. దానిపై మట్టికుప్పలు అడ్డుగా వేశారు. ఒకపక్క కొంతస్థలం ఖాళీగా ఉండటంతో నిత్యం విద్యార్థులు, స్థానికులు ఆ కొంచెం దారిలోనే ద్విచక్రవాహనల్లో వెళ్తున్నారు. అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. గ్రామానికి చెందిన పలువురు గాయపడ్డారు కూడా. అదే దారిలో పాఠశాలకు వెళ్లే కోనాపురానికి చెందిన బాలుడు దామోదర్ రెడ్డి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలనుకున్నాడు. రాళ్లను తీసుకొచ్చి.. ఇలా.. ఆ చిన్న రోడ్డును మూసివేస్తున్నాడు. మరొకరు ప్రమాదాల బారిన పడకూడదన్న పెద్ద మనసుతో గురువారం ఇలా రాళ్లు వేశాడు. పెద్ద మనసు కలిగిన పిల్లాడు కదూ..

-పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి)



భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపోత్సవం

తాడిపత్రి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీపోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపోత్సవాన్ని పెద్దఎత్తున భక్తులు తిలకించారు

← దీపోత్సవం నిర్వహిస్తున్న పండితులు

మళ్లీ దెబ్బతిన్న కాలువ గట్టు



కోతకు గురైన కాలువ గట్టు

కణేకల్లు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబిగనురు గ్రామ సమీపంలో గుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) కోతకు గురైంది. నాలుగు నెలల క్రితం కోతకు గురైన కాలువకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. కాలువపై వాహన రాకపోకలను నిలిపివేశారు. కొన్ని రోజులుగా పెద్ద వాహనాలు ఈ ప్రాంతంలో తిరగడంతో ఇసుక బస్తాలు నీటిలో జారిపోయి.. గురువారం సాయంత్రం మళ్లీ కోతకు గురైంది. నివారణ చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు.

విచ్చలవిడిగా గంజాయి

(5వ పేజీ తరువాయి)



గంజాయి మత్తులో యువకులు కత్తులతో దాడులు చేసుకున్నారు. వారు ఎందుకు దాడులు చేసుకున్నారో తెలియక అక్కడ ఉన్న జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. తరువాత ఆ యువకులు గంజాయి సేవించినట్లు తెలిసింది. ఇదే గ్రామంలోని గీతా నగర్‌లో ఓ ఉద్యోగి కుటుంబంపై గంజాయి మత్తులో ఉన్న యువకులు దాడులకు పాల్పడ్డారు. కొద్ది నెలల క్రితం సోమందేపల్లిలో అర్ధరాత్రి బైక్‌పై వెళుతూ మత్తులో కిందపడి ఒకరు మృతి చెందారు. నక్కలగుట్ట సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై వెళుతుండగా ఒకరు దుర్మరణం చెందారు. వీరు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులే పేర్కొన్నారు. ఇటీవల ఇదే గ్రామంలో ప్రధాన కూడలిలో గంజాయి మత్తులో ఉన్న యువకులు బాహాబాహీకి దిగగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు నెలల క్రితం పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై గంజాయి సేవించిన నలుగురు యువకులు వాహనాలను ఆపే ప్రయత్నం చేశారు. అటుగా వెళ్లిన ఓ పోలీస్ అధికారి గంజాయి మత్తులో ఉన్నారని అనుమానించి వారిని అక్కడి నుంచి పంపేసి ఒంగళూరు వైపు వెళ్లారు.

వైసీపీ హయాంలో బీజం

ఈ ప్రాంతంలో గంజాయి అంటే చాలా మందికి తెలియదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వ్యాపారానికి బీజం పడింది. ఇప్పుడు గంజాయి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకప్పుడు పట్టణాల్లో మాత్రమే దొరికే ఈ మత్తు గ్రామాల్లోనూ విరివిగా లభిస్తోంది. అక్రమార్జనకు అలవాటు పడిన గంజాయి ముఠా విసురుతున్న వలలో యువత చుట్టుకొని విలవిలాడుతోంది. వైసీపీ హయాంలో వివిధ రూపాల్లో గంజాయి యువతకు చేరుతూ వచ్చింది. ప్రస్తుతం పోలీసులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా గంజాయి సరఫరా మాత్రం ఆగడం లేదు. వైసీపీ హయాంలో గంజాయి మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కట్టడికీ శ్రీకారం చుట్టింది. దీంతో హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో పనిచేసే ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు అక్కడి నుంచే తీసుకువస్తున్నట్లు తెలిసింది. సోమందేపల్లి, పెనుకొండకు చేర్చేందుకు హిందూపురానికి చెందిన కొందరు ఉన్నట్లు సమాచారం. బయటి ప్రాంతాల నుంచి హిందూపురానికి రైళ్లలో తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్యాకెట్ల రూపంలో తయారుచేసి సోమందేపల్లి, పెనుకొండ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

విచక్షణ కోల్పోయి దాడులు

గత ఏడాది కాలంగా పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో గంజాయి బ్యాచ్ మత్తులో విచక్షణ కోల్పోతోంది. కొన్ని సందర్భాలలో వారే ప్రాణాల మీదుకు తెచ్చుకుంటుండగా, మరికొంత మంది ఇతరులపై దాడులకు దిగుతున్నారు. సోమందేపల్లిలో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలే నిలువెత్తు సాక్ష్యం. పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో వివిధ రూపాల్లో సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కొన్ని పాన్ షాపులు, సోడా బండ్లు, ఆటోల అడ్డా వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. యువతకు సిగరెట్లు, పాన్ మసాలా వంటి రూపాల్లో సరఫరా చేస్తున్నారు. మైకంలో ద్విచక్రవాహనాలను అతి వేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రెండు నెలల క్రితం 2.5 కిలోల గంజాయిని సోమందేపల్లిలో పట్టుకున్నాం. కొద్ది రోజులుగా సోమందేపల్లిలో యువత మత్తులో ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. వారు గంజాయి సేవించారా..? లేక ఇతర మత్తు పదార్థాలు వాడారా.? అనే విషయం తేలాల్సి ఉంది. గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

-రఘువరన్, సీఐ, పెనుకొండ

మార్కెట్‌లో మాఫియా..!

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారేంటి?' అని ప్రజలు నిలదీస్తున్నారు. వారితో వ్యాపారులు గొడవకు దిగుతున్నారు. పాతూరు మార్కెట్‌లో దళారీలు చెప్పిందే రేటు.

దళారీలదే పెత్తనం

పాతూరు మార్కెట్‌లో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇక్కడ పూలు మొదలుకుని కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువుల ధరలను నిర్ణయించడంలో దళారీలదే పైచేయిగా నిలుస్తోంది. గతంలో పాతూరులో తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు దొరుకుతాయనే నమ్మకం ఉండేది. ప్రస్తుతం మాఫియా ఆగడాలతో ధరలు పైపైకే పెరిగిపోతున్నాయి. సాధారణ బజారులో పూల ధర కిలో రూ.100 ఉంటే... పాతూరు మార్కెట్‌లో రూ.200-300కి అమ్ముతున్నారు. అలా ప్రజలను దోచుకుతింటున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

అద్దె ఎగవేత

నగరపాలక సంస్థ దుకాణాలకు అద్దె చెల్లించకుండా పలువురు వ్యాపారులు ఎగ్గొడుతున్నారు. పాతూరు మార్కెట్‌లో పలువురు వ్యాపారులు నగర పాలక సంస్థకు చెందిన దుకాణాలు, ఖాళీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటూ... అద్దె ఎగవేస్తున్నారు. ప్రతినెలా రూ.30లక్షల వరకు నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. మరికొందరు బినామీ పేర్లతో షాపులు నిర్వహిస్తూ... అద్దె వసూలు చేస్తున్నా ఏఎంసీకి చెల్లించకుండా జేబుల్లో వేసుకుంటున్నారు. మార్కెట్‌కు అనుకుని నివాసం ఉంటున్న వారు నగరపాలక సంస్థ దుకాణాలను సొంత వాటిగా మార్చేసుకున్నారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అద్దె మొత్తాన్ని దళారీలకు కడుతున్నారు. ఏళ్లగా ఈ తతంగం జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, కుళ్లిపోయిన కూరగాయలను అక్కడే పడేస్తుండడంతో మార్కెట్ ప్రాంతమంతా కంపు కొడుతోంది.

పాతూరు మార్కెట్‌ను పరిశీలిస్తాం



పాతూరు మార్కెట్‌లో అపరిశుభ్రత, అద్దె ఎగవేతపై పరిశీలిస్తాం. మార్కెట్‌లో కుళ్లిపోయిన కూరగాయలు ఇతర వ్యర్థాలు అక్కడే పడేస్తుండడంతో చెత్త పేరుకుపోయి, దుర్గంధం వస్తోంది. వ్యర్థాలను మున్సిపల్ వాహనంలోనే వేయాలి. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

-బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



మార్కెట్ వద్ద చెత్తాచెదారం

పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

- అసెస్‌మెంట్ నంబరుతో లింకుపెట్టిన ప్రభుత్వం
- ఖాళీ స్థలాలకూ ఇక పన్ను తప్పనిసరి
- మున్సిపాల్టీలు, నగర పంచాయతీలకు వర్తింపు

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇకమీదట ఆస్తి పన్ను చెల్లించిన వారికే రిజిస్ట్రేషన్ నిర్వహించాలని రిజిస్ట్రేషన్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విధానం పట్టణాల్లో గతనెల 16 నుంచే అమలులోకి వచ్చింది. సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాల్లో అసెస్‌మెంట్ నంబరు ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. నిర్మాణపరమైన ఆస్తి అయినా, స్థలాలు అయినా అసెస్‌మెంట్ నంబరు తప్పనిసరి. ఖాళీస్థలాల రిజిస్ట్రేషన్‌కు కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆస్తి పన్ను బకాయిలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త నిబంధన తెరపైకి తెచ్చింది. జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, కదిరి మున్సిపాల్టీలు పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ నగరపంచాయతీల్లో పన్ను చెల్లించిన ఆస్తులకే రిజిస్ట్రేషన్ అన్న విధానాన్ని అమలు చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో మొండి బకాయిలు గణనీయంగానే ఉన్నాయి. నోటీసులు ఇస్తే రెవెన్యూ సిబ్బందిపై ఒంటికాలితో లేచే నాయకులు కూడా ఉన్నారు. కోర్టులో కేసులు వేస్తూ మున్సిపాలిటీలను ముప్పుతిప్పలుపెడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లలో పన్ను చెల్లింపు విధానాన్ని అమలు చేస్తోంది. ఎవరి ఆస్తులైనా అమ్ముకోవాలన్నా, వారసులకు గిఫ్ట్ డీడ్ ఇవ్వాలన్నా, ఆస్తి పన్ను సక్రమంగా చెల్లించి ఉండాలి. రిజిస్ట్రేషన్ చేసే సమయానికి ఆ ఏడాది పన్ను చెల్లింపు కూడా పూర్తి కావాలి. లేదంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అసెస్‌మెంట్ నంబరు కానపడదు. దీంతో రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుకాదు. దీని వల్ల ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి ప్రతి పట్టణంలో ఏటా 90శాతం పన్ను వసూలు అవుతోంది. మిగిలిన 10శాతం పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఖాళీ స్థలాలపై కన్ను

మున్సిపాలిటీల్లో ఇబ్బడి ముబ్బడిగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటికి పన్ను వేసే పరిస్థితి లేదు. రీసర్వేలో కొంతవరకు ఖాళీ స్థలాలను గుర్తించారు. పన్నులు వేశారు. అయినా సరే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇకపై ఖాళీస్థలాలు అమ్ముకుందామన్నా సరే పన్ను చెల్లించక తప్పదు. ఖాళీ స్థలం ఉన్నప్పటికీ పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కొందరు ఖాళీ స్థలాలను తమ వారసులకు గిఫ్ట్ డీడ్‌గా ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు తక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. ఇకపై వీటికి కూడా పన్ను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.

పన్ను చెల్లిస్తేనే...



జిల్లాలోని మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో ఆస్తి, ఖాళీస్థలాల పన్నులు, ఇతర పన్నులు చెల్లిస్తేనే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తాం. పన్ను చెల్లిస్తేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అసెస్‌మెంట్ నంబరు కనిపిస్తుంది. లేకపోతే ఆ నంబరు కనిపించదు. అది కనిపించకపోతే రిజిస్ట్రేషన్‌లు జరగవు.

-క్రిష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్, శ్రీసత్యసాయి జిల్లా



ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నాన్ లే అవుట్‌లకు చెక్

అసెస్‌మెంట్ నంబరు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలన్న నిబంధన పెట్టడంతో నాన్ లే అవుట్ స్థలాలకు చెక్ పడనుంది. ఆస్తి పన్ను చెల్లించని నాన్ లే అవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశంలేదు. ఇప్పటిదాకా స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. ప్లాన్ మంజూరు సమయంలో పన్ను చెల్లిస్తే సరిపోయేది. ఇకపై నాన్ లేఅవుట్ స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పటికే పన్ను చెల్లించి ఉండాలి. లేదా 10శాతం రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. ఆ తరువాత పన్ను వేయించుకోవాలి. అప్పుడే రిజిస్ట్రేషన్ అవుతుంది.

9న జాబ్ మేళా

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువత కోసం ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పల్లవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం ఇంటర్, ఆపై విద్యార్హత కలిగిన వారు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు అనంతపురం కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు.

నేడు ఎన్నికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంత జిల్లాలో 25, శ్రీసత్యసాయి జిల్లాలో 30 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశుసంవర్థక శాఖ యంత్రాంగం ఏర్పాట్లను సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఒక్కో సహకార సంఘంలో ఏడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. నిర్వహణకు పలువురు వెటర్నరీ వైద్యులను ఎన్నికల అధికారులుగా నియమించారు.ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు కోసం విన్నవించినట్లు తెలిసింది.

మాంటిస్సోరీ ఎలైట్ విద్యార్థుల సత్తా

రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రభంజనం



వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీల్లో మాంటిస్సోరీ ఎలైట్ విద్యార్థులు సత్తా చాటినట్లు ఎండీ కృష్ణభరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర బుధవారం ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడా పోటీల్లో రాణించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యతో పాటు క్రీడలలోనూ తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ స్థాయిలో నిలవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల విజయంలో వారి తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు అందించిన సహకారం మరువలేనిదన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు వీరే...

అండర్-14లో మణి మతుమ్(ఫుట్‌బాల్), హితేష్ చౌదరి(బాస్కెట్ బాల్), జి. దీపక్ రెడ్డి(ఫ్లోర్ బాల్), శివచరణ్(బాల్ బ్యాడ్మింటన్), భవిష్ అహిల్(తైక్వాండో), పవన్ తేజ్(హ్యాండ్‌బాల్), జశ్వంత్(ఖోఖో), పూజ్య(ఖోఖో), ధీరజ్ రెడ్డి(వాలీబాల్)

అండర్-17లో మంజునాథ్, గోవర్ధన్ నాయక్(వాలీబాల్), దినేష్ కుమార్, స్నేహవర్షిణి, పూజిత, సోనాక్షి(బాస్కెట్‌బాల్), హర్ష(ఖోఖో), స్వాతి, హేమంత్(హ్యాండ్‌బాల్), సాయి స్వరాజ్(ఆర్చరీ), హర్ష(లాంగ్ టెన్నిస్), మహేంద్ర, చందన(ఖోఖో), నాగ నిదీష్(హ్యాండ్ బాల్)

అండర్-19లో పీఎస్ దీప్తి, పీఎల్ సాయిబృంద(వాలీబాల్), వై. లిఖిత్(హ్యాండ్‌బాల్), హర్షవర్ధన్, లోకేనాథ్(బాస్కెట్ బాల్), గురువర్షిణి, రక్షిత (హ్యాండ్‌బాల్), కిరణ్(షాట్‌పుట్), హన్సిక (నెట్ బాల్), శ్రీహస్త(హ్యాండ్‌బాల్) ప్రతిభ చూపారు.



క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

డ్రైవర్ల సంఘం ఎన్నికలకు నామినేషన్లు

అనంతపురం వైద్యం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఎన్నికలకు ఈనెల 7న నామినేషన్లు స్వీకరిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడిని ఎన్నుకుంటామన్నారు. వివిధ కారణాలతో ఐదు సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. దీంతో ఈనెల 14న నిర్వహించే ఈ ఎన్నికలకు 7న నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై మహిళా కమిషన్ సీరియస్

సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం

అమరావతి/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లికి చెందిన మైనర్ విద్యార్థిని ఆత్మహత్యపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. బాలిక ఆత్మహత్యపై కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ జిల్లా ఎస్పీని వివరణ కోరారు. తోటి విద్యార్థి వేధింపులు, దాడి నేపథ్యంలో ఫిర్యాదు చేసినా పోలీసులు సరిగా స్పందించలేదనే మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి స్పందన గత నెల 26న ఆత్మహత్యకు యత్నించింది. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జిల్లా ఎస్పీకి గురువారం ఫోన్‌చేసి వివరాలు ఆరా తీశారు. బాలిక ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేశామని, వేధింపులకు పాల్పడిన విద్యార్థిని కూడా అరెస్టు చేశామని ఎస్పీ ఆమెకు వివరించారు. బాలిక ఆత్మహత్యకు ప్రేరేపితమైన కారణాలపై సమగ్ర నివేదికను పంపాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎస్పీని ఆదేశించారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు

ఇంటర్ విద్యార్థిని స్పందన అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన పులేటిపల్లిలో గురువారం జరిగాయి. గత నెల 26న ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో 8 రోజులు చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం విద్యార్థిని మృతదేహాన్ని పులేటిపల్లికి తీసుకొచ్చారు.



సొమ్మసిల్లిన విద్యార్థిని తల్లి అమల

గ్రామంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. విద్యార్థిని కడసారి చూపు కోసం బంధువులు, గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. విద్యార్థిని మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తల్లి అమల రోదించిన తీరు ఇక్కడికి వచ్చినప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

జువైనల్ హోంకు నిందితుడు

విద్యార్థిని ఆత్మహత్య కేసులో నిందితుడిని జువైనల్ హోంకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. తోటి విద్యార్థి అసభ్యకర ప్రవర్తన చేస్తున్నట్లు స్పందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట పోక్సోకేసు నమోదు చేశామని, తర్వాత ఆమె మృతి చెందడంతో ఆత్మహత్య ప్రేరేపణ కింద ఆ విద్యార్థిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనంతరం అతన్ని ధర్మవరం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి ఆదేశాల మేరకు జువైనల్ హోంకు తరలించామని పోలీసులు చెప్పారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో గురువారం 17 మంది డిబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో నలుగురు, గుత్తి ఎంఎస్ కళాశాలలో ముగ్గురు, హిందూపురంలోని బాలయేసు కళాశాలలో ఇద్దరు, బాలాజీ విద్యామందిర్ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులు కాపీయింగ్ పాల్పడుతుండగా, గుర్తించి డిబార్ చేసినట్లు తెలిపారు.



నగరంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో కాళ్లపై రాసుకొచ్చిన విద్యార్థిని

యువకుడి ఆత్మహత్య

అగళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో మహాలింగప్ప(32) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. మహాలింగప్ప వెల్డింగ్ పని చేసేవాడు. కుటుంబ జీవనం విషయంగా భార్య శోభతో తరచూ గొడవపడేవాడు. ఈక్రమంలోనే ఆమె తన మూడేళ్ల కుమార్తెను పుట్టింటిలో వదిలి బ్యాంక్ కోచింగ్ కోసం నంద్యాలకు వెళ్లింది. ఈనేపథ్యంలో ఒంటరితనంతో మనస్తాపం చెందిన మహాలింగప్ప తాను బాడుగకు ఉన్న ఇంట్లోనే ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి తమ్ముడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెనుకొండరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కియ సమీపంలో 44వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్టపర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(32) మృతిచెందాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు నర్సింహారెడ్డి కియ పరిశ్రమలో పని చేసేవాడు. పెనుకొండ నుంచి కియ పరిశ్రమలో విధులు నిర్వర్తించడానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అయితే మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి డివైడర్లను ఢీకొట్టాడు. దీంతో నరసింహారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

13న బీఎస్ఎన్ఎల్ జాతీయ లోక్ అదాలత్

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టుల్లో ఈనెల 13న బీఎస్ఎన్ఎల్ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జిల్లా బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేషనల్ లోక్‌అదాలత్‌లో క్లోజ్ చేసిన బీఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్, ఫైబర్ వినియోగదారులు తమ బకాయిలను తగిన రాయితీతో చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోర్టుకు హాజరు కాకుండా ఈనెల 13లోపే వినియోగదారులు బకాయిలు చెల్లించవచ్చునన్నారు. వివరాలకు 94404 08226, 94415 53313 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

7న క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్, టేబుల్‌టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 7న ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో రెగ్యులర్‌గా చదువుతూ 17-25సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కబడ్డీ క్రీడాకారిణులు అర్హులన్నారు. వివరాలకు 94933 48808 నంబరులో సంప్రదించాలని కోరారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ

అమడగూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ సచివాలయ సమీపంలో నివాసం ఉంటున్న మౌలాబీ అనే వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని ఇద్దరు దుండగులు గురువారం లాక్కెళ్లారు. బాధితురాలు తెలిపిన మేరకు ఇంటి పక్కనే ఉన్న హోటల్లో టిఫిన్ తీసుకుని వెళ్తుండగా ద్విచక్రవాహనంపై దారి కాచిన దుండగులు వృద్ధురాలిని ఆపి పలకరించారు. ఇక్కడ లకవా (పక్షవాతం) కొట్టిండే వాళ్లు ఎవరు అని అడిగారు. ఆమె సమాధానం చెప్పేలోగానే వృద్ధురాలి మెడలోని ఒక తులం బరువున్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం పక్కన ఉన్న దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను తీసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో అప్లికేషన్ డెవలపర్ వెబ్ అండ్ మొబైల్ అనే కంప్యూటర్ కోర్సును ఈనెల 17 నుంచి ప్రారంభిస్తామన్నారు. పది, ఇంటర్ పాస్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్:9182288465 లేదా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులను తరలిస్తున్న వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వాహనం

సోమందేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకలపల్లి గ్రామం వద్ద గురువారం ట్రాక్టర్ ఢీకొనడంతో క్రూజర్‌వాహనం బోల్తాపడింది. వివరాలు ఇలా...సెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆనందనిలయం ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నారు. ప్రతిరోజులాగే విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చేందుకు ప్రైవేట్ క్రూజర్ వాహనం బ్రహ్మసముద్రం గ్రామానికి వెళ్లింది. అక్కడ 12మంది విద్యార్థులను ఎక్కించుకుని ఉపాధ్యాయురాలు పుష్ప వస్తుండగా మేకలపల్లివద్ద ప్రమాదం జరిగింది. 1, 2, 3 తరగతి విద్యార్థులు అందులో ఉన్నట్లు సమాచారం. పాఠశాలలో మొత్తం 58మంది విద్యార్థులున్నారు. యాజమాన్యం విద్యార్థులను తరలించడానికి వ్యాన్ ఏర్పాటుకు సంబంధించి అనుమతులు పొందలేదని మండల విద్యాశాఖాధికారులు ఆనంద్ బాబు, ఆంజనేయులునాయక్ తెలిపారు. విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

12న ఇంటర్వ్యూలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు ఎంపిక చేయడానికి ఈనెల 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 8వతరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివి 18-40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బెంగళూరులోని ఆశీర్వాద్ ప్లంబింగ్ స్కూల్‌లో 75 రోజుల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయంతో స్వయం ఉపాధి కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 81217 17846ను సంప్రదించాలని కోరారు.

మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : ఎస్కేయూలోని పీజీలోని వివిధ కోర్సులలో మిగిలిపోయిన సీట్లకు జీఓ నెం-230 మేరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య నరసింహన్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంట్రన్స్-2025లో అర్హత సాధించని, పీజీసెట్ రాయని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఎస్కేయూలోని అడ్మిషన్ల డైరెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

డ్రాగా ముగిసిన ఆంధ్ర-కర్ణాటక మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో జరుగుతున్న ఆంధ్ర మ్యాచ్ డ్రాగా ముగిసింది. కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ చివరిరోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 36-2తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 83ఓవర్లలో 179-9పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రాజేష్ 41, సిద్దు కార్తీకొరెడ్డి 50 పరుగులు చేశారు. అనంతరం 201పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటక జట్టు 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 36పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆంధ్ర 3 పాయింట్లతో లీడ్‌లో ఉండగా, కర్ణాటక పాయింట్‌తో తరువాత స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో మ్యాచ్ అఫిషియల్స్ రెఫరీ మోమిత చక్రబోర్తి, అంపైర్లు జైబి సంఘని, ప్రేమ్ ఎస్ భార్గవ్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, మాజీ కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు సర్దార్, కార్యనిర్వాహకులు టీవీ చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధు ఆచారి, శర్మాస్‌వలీ, ఇనయతుల్లా, వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడాపోటీలు

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలోని భవిత కేంద్రాలలో సేవలు పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాకేంద్రంలోని న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మైదానంలో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. 31మండలాల భవిత కేంద్రాల నుంచి దివ్యాంగుల పిల్లలు ఈ పోటీలలో పాల్గొనడానికి వచ్చారు. పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, అండర్-17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొత్తం 150మంది ఈపోటీలలో పాల్గొన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఈక్రీడాపోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన దివ్యాంగ పిల్లలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికే ఈపోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రతినిధి మంజుల, ఏఎంఓ వేణుగోపాల్, అసిస్టెంట్ ఏఎంఓలు ఫణిరాజ్, నారాయణ స్వామి, పలువురు ఐఈఆర్టీలు పాల్గొన్నారు.



పరుగు పోటీలో దివ్యాంగుడు

విషజ్వరంతో చిన్నారి మృతి

విడపనకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి విష జ్వరంతో గురువారం రాత్రి మృతి చెందింది. విడపనకల్లు గ్రామానికి చెందిన వినోద్, వసంత , దంపతుల కుమార్తె తనూశ్రీ (16నెలలు) బుధవారం ఉదయం నుంచి జ్వరంతో బాధపడతుండేది. దీంతో విడపనకల్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. జ్వరం తీవ్రత తగ్గలేదు. గురువారం కూడా విడపనకల్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల వద్దకు వెళ్లారు. కానీ చిన్నారి పరిస్థితి విషమించటంతో గురువారం రాత్రి ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలిక మృతి చెందింది.



తనూశ్రీ మృతదేహం

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్



మాట్లాడుతున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్, పక్కన జేసీ శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేకుంటే బ్లాక్‌లిస్టులో పెడతామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ హెచ్చరించారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం ఆయన వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అహుడా పరిధిలో అక్రమ లేఔట్ల క్రమబద్ధీకరణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. ప్రతి లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేనిపక్షంలో బ్లాక్ లిస్టులో పెట్టి భవిష్యత్తులో ఎటువంటి లేఔట్లు వేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐజీ, ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో అత్యాధునిక మౌళిక వసతులు కల్పించాలన్నారు. అహుడా పరిధిలో అభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కేఎండీ ఇషాక్, ఈఈ దుశ్యంత్, డీఈ రేవంత్, జేపీఓ హరీష్‌చౌదరి, పబ్లిక్‌హెల్త్ డీఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలపై 1098కు కాల్ చేయండి'

అనంతపురం వైద్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బాల్యవివాహాలు జరుపుతుట్లు గాని, ప్రోత్సహిస్తున్నట్లు గాని తెలిస్తే 1098కు కాల్‌చేసి సమాచారాన్ని అందించాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ అనూరాధ సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలను చేయడానికి ఎవరైనా సిద్దపడినా, వారికి సహకరించినా 1098కు కాల్ చేయవచ్చునని తెలిపారు. బాల్యవివాహలవల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హేమలత, విజయకుమారి, వర్కర్లు జమున, వీణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి



రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్థంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో గల ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పోతుల మనోజ్, సహాయ కార్యదర్శి సత్రసాల మంజునాథ్, ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పొలమడ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

శింగనమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిమెల పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకుని సీజ్ చేశారు. ఉదయం పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్‌చేసి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత రెండు రోజుల్లో తరిమెల పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆ ఇళ్లను కూల్చొద్దు: సీపీఎం

అనంతపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇళ్లను కూల్చవద్దని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. డీసీఎంఎస్ కార్యాలయం వద్ద గత 50 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న 8 కుటుంబాలతో కలిసి గురువారం ఆయన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఎప్పుడు మారినా ఇక్కడి కుటుంబాల నివాసాలను తొలగించే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారిందన్నారు. ప్రత్యామ్నాయంగా నగరంలో ఎక్కడైనా స్థలాలు చూపించి ఇళ్లు కట్టిస్తే అక్కడికే వెళ్తామని ఆ పేద కుటుంబాలు తమ బాధను వ్యక్తం చేస్తున్నా వినే నాథుడే లేడని వాపోయారు. ఈ 8 కుటుంబాలు ప్రభుత్వానికి ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు కడుతున్నారని, వారికి రేషన్ కార్డు ఆధార్ కార్డులతోపాటు ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకం ఈ డోర్ నెంబర్ మీదనే వస్తున్నాయని తెలిపారు. ఇపుడు అధికారులు సదరు పేదల నివాసాలను తొలగించాలని ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. వీరి నివాసాలను తొలగించాలని చూస్తే సీపీఎం అడ్డుకుంటుందని హెచ్చరించారు. ప్రత్యామ్నాయంగా నగరానికి దగ్గరలో స్థలం చూపించి ఇళ్లు నిర్మించిన తర్వాతే ఖాళీ చేయించాలని లేనిపక్షంలో బాధితులకు అండగా నిలిచి పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ప్రకాష్, వలి, సభ్యులు ఎన్టీఆర్ శీన, రాజు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1425 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 34టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

శబరిమలకు ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ గురువారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లోని శ్రీధర్మశాస్త్ర భక్త సమాజంలో ఆయన ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులతోపాటు అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఇరుముడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



పాతూరు దత్త మందిరంలో అలంకరణలో దత్తాత్రేయస్వామి



జడ్పీ సమీపంలోని దత్తమందిరంలో..



రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలో పూజలు అందుకుంటున్న దత్తదేవుడు

భక్తిశ్రద్ధలతో దత్తజయంతి

● దత్తమందిరాలు, షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దత్తజయంతిని పురస్కరించుకుని నగరంలోని దత్తమందిరాలు, షిర్డీసాయి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. పాతూరులోని దత్తాత్రేయ దేవస్థానంలో అర్చకులు వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై వేద మంత్రోచ్చారణల నడుమ దత్తాత్రేయ వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలోనూ దత్తదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మధ్యాహ్నం దాదాపు 1200 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే ఆదిమూర్తినగర్‌లోని షిర్డీసాయి ఆలయంలో, హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో, మూడోరోడ్డులోని షిర్డీసాయిబాబా ఆలయంలో దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: జేఎన్‌టీయూ వీసీ

అనంతపురంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు సూచించారు. మండలంలోని ఆలమూరురోడ్డులో గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంటర్ జూనియర్ కళాశాలల క్రీడా మహోత్సవం (స్పోర్ట్స్ టెక్) 2కే25ను నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూఏతో పాటు జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ద్వారకానాథ్‌రెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. క్రీడల్లో రాణించే వారికి భవిష్యత్తులో అన్నింటా మంచి అవకాశాలు దక్కుతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. పల్లె కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ..క్రీడలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. క్రికెట్, కబడ్డీ, బాస్కెట్ బాల్, లాంగ్ జంప్ వంటి 15కిపైగా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, పీవీకేకే డిప్లొమా ప్రిన్సిపాల్ వైభవ్, బాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఏఓ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లను ఎగురవేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి: డీఆర్‌డీఏ పీడీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ సూచించారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీడీ శైలజ హాజరై మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌పీఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకానికి తగిన లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారుల సహకారాన్ని తీసుకుని, రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీవనోపాదుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గంగాధర్, ఏపీఎంలు రియాజ్, శివప్రసాద్, వాసన్ ఎన్జీవో ప్రతినిధి ఉత్తప్ప, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శైలజ

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం నగర శివారు బెంగుళూరు రోడ్డులోని శివకోటి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ ఆవరణలో సత్యనారాయణస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల నడుమ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం..

అనంతపురం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం నందమూరి నగర్‌లో చిట్టీల పేరుతో ఓ మహిళ భారీ మోసానికి పాల్పడింది. గురువారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నందమూరి నగర్‌కు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ సుమారు పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఆమె వద్ద సుమారు 50 మందికి పైగానే చిట్టీలు కట్టారు. అయితే ఆమె డబ్బులు ఇవ్వకుండా ఉన్నపలంగా పరారైంది. దీంతో ప్రభావతి అనే బాధితురాలితో పాటు మరికొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఆదిలక్ష్మి బాధితుల నుంచి సుమారు రూ. రెండు కోట్లకు పైగా వసూళ్లు చేసిన అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత...

రుద్రంపేటకు చెందిన బియ్యం వ్యాపారి నుంచి 13 ప్యాకెట్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఒక్కో ప్యాకెట్‌లో 40 కేజీల చొప్పున 13 ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా సిండికేట్ నగర్ వద్ద గుర్తించి పట్టుకున్నామని, అనంతరం వ్యాపారి సుబ్బును అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఘంటసాల సంగీత విభావరి

అనంతపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకుని స్థానిక లలితకళాపరిషత్‌లో గురువారం సాయంత్రం సంగీత విభావరిని నిర్వహించారు. డీఆర్వో మలోల, లలిత కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్యఅతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ... తెలుగు ప్రజలకు తరతరాలకూ తరగని ఆస్తి ఘంటసాల అని కొనియాడారు. ఘంటసాల వెంకటేశ్వరరావు వేసిన సంగీత బాటను అనుసరిస్తూ ఎంతోమంది కళాకారులు ఉన్నతస్థానాలకు ఎదిగారన్నారు. జిల్లాలో కళాకారులకు కొదువ లేదని, అన్నిరకాల కళలకు అనంతపురం జిల్లా వేదికవుతోందని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఘంటసాల పాడిన పాటలను ఆలపించి అలరించారు. లలిత కళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల విగ్రహానికి పాతపాటల ప్రేమికుల సంఘం ఆధ్వర్యంలో డీఆర్‌ఓ, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాయనీ గాయకులు ఘంటసాల పాటలు ఆలపిస్తూ స్వరనీరాజనం పలికారు. తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద, కమలానగర్‌లోని అనాథాశ్రమంలో అన్నదానం చేపట్టారు. పాతపాటల ప్రేమికుల సంఘం నాయకులు జీవి రామయ్య, ఓబుళదాస్, పాలసముద్రం నాగరాజు, సుధాకర్‌బాబు, జాగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, కేశవ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



లలితకళాపరిషత్‌లో ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ మలోల, కళాకారులు



కటౌట్ వద్ద అభిమాన సంఘం నాయకులు

అంబరాన్నంటిన 'అఖండ-2' సంబరం

● మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో బాలయ్య అభిమానుల బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ చేస్తున్న ఎంఎస్ రాజు తదితరులు

అనంతపురం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో అభిమానుల్లో సంబరం అంబరమంటింది. ఈ క్రమంలో నగరంలో అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి సందడి చేశారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో అంఖడ జెండాలతో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాంనగర్ నుంచి గంగా గౌరీ థియేటర్ వరకూ ర్యాలీ కొనసాగించారు. జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తూ...సందడి చేశారు. తర్వాత థియేటర్ వద్ద 110 కేజీల కేక్ కట్ చేశారు. ఇక బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, ఇతర నాయకులు, అభిమానులు హంగామా చేశారు. థియేటర్ వద్ద భారీ కటౌట్లు కట్టి.. తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణం తనిఖీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు లోని కక్కలపల్లి సమీపంలోగల శ్రీహరి ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ వెంకట్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, ఎరువులు, పురుగుమందుల స్టాక్‌ను పరిశీలించారు. ఇందులో భాగంగా ఓ ఫామ్‌లు లేకుండా నిల్వ ఉంచుకున్న రూ.94420 విలువైన ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేసినట్లు ఏడీఏ పేర్కొన్నారు.

బీజేపీలోకి న్యాయవాది చేరిక



శ్రీధర్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో న్యాయవాది శ్రీధర్ బీజేపీలోకి చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజేష్ కాషాయ కడువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడినై బీజేపీలోకి చేరినట్లు చెప్పారు. నాయకులు అయ్యన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గార్లదిన్నె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట వద్ద గల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో పామిడి వైపు వెళుతున్నాడు. తిమ్మంపేట సమీపంలోకి రాగానే ప్రమాదం చోటు చేసుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ద్విచక్రవాహనం బోల్తా పడిందా..? లేక ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనేది తెలియాల్సి ఉంది.

'స్క్రబ్ టైఫస్.. ప్రాణాంతకం కాదు'

గార్లదిన్నె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిత పట్ల ఎవరూ ఆందోళన చెందకండని, అది ప్రాణాంతకమైనది కాదని మండల వైద్యాధికారి ఉదయ్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్‌తో ప్రజలు భయందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఆ వ్యాధి ఈ ప్రాంతంలో ఎక్కడా లేదన్నారు. పొలాల్లో కీటకాలు కుట్టడం ద్వారా సోకుతుందన్నారు. అది సోకితే చర్మంపై దద్దుర్లు, పురుగు కుట్టిన వద్ద నల్లరంగు మచ్చలు ఏర్పడడం, జ్వరం, తలనొప్పి, రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఆ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు తగిన మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. పొలాల వద్ద పనులు చేసే సమయంలో పురుగులు కుట్టకుండా రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు, కూలీలకు సూచించారు. అదేవిదంగా ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నృత్య దర్శకుడు సురేష్‌కు కలెక్టర్ సన్మానం



సురేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నృత్య దర్శకుడిగా 30 ఏళ్ల కళారంగానికి సేవలందించిన సురేష్‌ను కలెక్టర్ ఆనంద్ సన్మానించారు. సరేష్‌ను గురువారం కలెక్టర్ తన చాంబర్‌కు పిలిపించుకుని శాలువాకప్పి సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. గతనెల 29న అమెరికా బోస్టన్ యూనివర్శిటీ వారు ముంబయిలో నిర్వహించిన సభలో సురేష్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆ క్రమంలోనే సురేష్‌ను కలెక్టర్ పిలపించుకుని సన్మానించారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో గ్రామాల్లో భజన మందిరాల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ సుధారాణి గురువారం ప్రకటనలో తెలిపారు. దేవాలయాలకు అనుసంధానంగా ఆయా ఆలయాల వద్ద మూడు విభాగాల్లో మందిరాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం స్థల వివరాలు, యజమాని ఎన్‌ఓసీని జతచేసి దరఖాస్తులను జిల్లా కేంద్రంలో హెచ్చెల్సీ కాలనీలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జిల్లా కమిటీ ఎంపిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీజీ క్లాస్-4 ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎంపికైంది. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బనారాయణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు గోవిందు ఆధ్వర్యంలో ఈ ఎంపిక ఏకగ్రీవమైంది. జిల్లా అధ్యక్షుడిగా గౌస్ పీరా, కార్యదర్శిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా వాజిద్ బాషా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భాస్కర్, ఉపాధ్యక్షులుగా ముక్తియార్ అహమ్మద్, వినయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మీదేవి, జయచంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శిగా షెక్షావలి ఎంపికయ్యారు. వీరిని ఏపీఎన్జీఓ సంఘం నాయకులు, ఏపీజీ క్లాస్-4 ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైసీపీ నాయకుల వ్యాఖ్యలు సిగ్గుచేటు

మండల కన్వీనర్ శ్రీరాములు



మాట్లాడుతున్న పాలబండ్ల శ్రీరాములు

బ్రహ్మసముద్రం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కన్నేపల్లి-భూపసముద్రం వంతెన తమ ప్రభుత్వ హయాంలోనే మంజూరైందని వైసీపీ నాయకులు చెప్పుకోవడం.. సిగ్గుచేటని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు మండిపడ్డారు. కన్నేపల్లిలో వంతెన నిర్మాణ సందర్భంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు తమ ఎమ్మెల్యేని ఏకవచనంతో సంబోధిస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. వైసీపీ నాయకులు వేసిన శిలాఫలకాలు కూడా కూలిపోయే పరిస్థితికి వచ్చాయంటే వారి చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోందన్నారు.

కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కణేకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న కేజీబీవీలో రూ. 41.60 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీరూమ్‌ను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. అలాగే మండలంలోని నాగేపల్లి వద్ద రూ. 1.30 కోట్లతో నిర్మించిన హెచ్చెల్సీ బ్రిడ్జిని ప్రారంభించారు. రూ.28 లక్షలతో రీమోడల్‌గా చేసిన హాస్టల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ వన్నారెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, సుదర్శన్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, బసువరాజు, వెంకటేశులు, బాయినేని నవీన్, చాంద్‌బాషా, అనిల్, కురుబ నాగరాజు, ప్రభాకర్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

బొమ్మనహాళ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి తెలిపారు. ముందుగా ఉద్దేహాళ్‌లో హైస్కూల్‌లో నిర్వహించే మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి ఈనెల 13న నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అనిల్‌కుమార్‌నాయక్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణంలో గురువారం సబ్‌డివిజన్‌లోని సీఐ, ఎస్‌ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరువర్గాలను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పలు కేసులు పరిష్కరించేవిధంగా చూడాలన్నారు. ఇందులో సీఐలు ఆరోహణరావు, శివగంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి.. సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక రజక కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 33వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా తరిమెల గిరి, జిల్లా కార్యదర్శిగా ఓతూరు పరమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కమిటీ ఏర్పాటు

గుత్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ పాఠశాలలో గుత్తి, పెద్దవడుగూరు, యాడికి మండలాల ఎస్టీయూ నూతన కమిటీలను గురువారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నారాయణస్వామి, చిన్న రామాంజినేయులు, గౌరవ అధ్యక్షుడిగా కొలంబస్, యాడికి మండల అధ్యక్షుడిగా చలపతి, కార్యదర్శిగా హరినాథ్, పెద్దవడుగూరు మండల అధ్యక్షుడిగా పులికొండ, కార్యదర్శిగా నాగేంద్రతో కమిటీ సభ్యులను, జిల్లా కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న, వరి, పత్తి పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కనీస మద్దతు ధరతో వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీహెచ్ రాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలలకు మైక్‌ల వితరణ

శెట్టూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాకొడికి ఉన్నత, అయ్యగార్లపల్లి ప్రాథమిక పాఠశాలలకు రూ.28 వేల విలువైన మైక్‌లను ఇన్నినిటీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ ఇచ్చారు. వాటిని గురువారం ఆయా పాఠశాలలకు అందజేశారు.

ఇన్‌ఫ్లో 2,530 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,530, ఔట్‌ఫ్లో 2,530 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.726 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,812 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

15న ఆర్‌ఎంపీల సమస్యలపై దీక్ష

కూడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీల సమస్యలపై ఈనెల 15న ఉరవకొండలో రిలే నిరాహార దీక్ష చేస్తున్నట్లు జైభీమ్ పార్టీ నాయకుడు రామప్పనాయక్ గురువారం తెలిపారు. ఆర్‌ఎంపీలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరారు.

డీడీఓ కార్యాలయాలు ప్రారంభం

కళ్యాణదుర్గం, గుంతకల్లులో ప్రారంభించిన ఎమ్మెల్యేలు

కళ్యాణదుర్గం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని ఏర్పాటు చేసిన నగరవనాన్ని ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, స్థానిక టీడీపీ నాయకులతో పరిశీలించారు. ఎమ్మెల్యే అన్న క్యాంటీన్‌ను పరిశీలించి.. అక్కడే టిఫిన్ చేశారు.

● గుంతకల్లు : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక ఏర్పాటుచేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు (డీడీఓ) కార్యాలయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం లాంఛనంగా ప్రారంభించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ఒక గొడుగు కిందకు తెచ్చే డీడీఓ కార్యాలయ విధానం అద్భుతంగా ఉందని ఎమ్మెల్యే కొనియాడారు. ఇందులో డీడీఓ విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ దేవదాసు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, జనసేన నాయకుడు వాసగిరి మణికంఠ పాల్గొన్నారు.

● ప్రజా దర్బార్

గుంతకల్లుటౌన్ : స్థానిక చక్ర అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కళ్యాణదుర్గంలో డీడీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని, గుంతకల్లులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

డ్రైనేజీ కాలువ పనులకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీకట్టవద్ద నుంచి నంద్యాల రోడ్డు వరకు మురికినీటి కాలువ స్థానంలో రూ.80 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి భూమిపూజ గురువారం నిర్వహించారు. పట్టణంలో పలుచోట్ల ఓపెన్‌డ్రైనేజీలు ఉన్నాయని, వాటిని పరిశీలించి అండర్ డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడు, నరేంద్రనాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి, విజ్జి, మల్లికార్జున పాల్గొన్నారు.

● చెక్కుల పంపిణీ: సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన దాదాపు రూ.46 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే స్థానిక నివాసంలో బాధితులకు అందజేశారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మొత్తం 145 అర్జీలు వచ్చినట్లు ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. కాగా, మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు హెచ్చెల్సీ నీరు విడుదల చేయాలని మండల వైసీపీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఇందులో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ గుత్తా శ్రీనివాసులునాయుడు, నాయకులు బాలరంగయ్య, చవ్వా కులశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, వేణు, సర్పంచు శివరామయ్య, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మీ మొబైల్.. మీ ఇంటికే..

బొమ్మనహాళ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మీ మొబైల్.. మీ ఇంటికే.. కార్యక్రమంలో భాగంగా మండలంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు గురువారం వాటిని అందజేశారు. ఎస్ఐ నబీరాసుల్, ట్రైనీ ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి అందించారు.

కుందుర్పమ్మ గిరి ప్రదర్శన

కుందుర్పి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కుందుర్పమ్మ గిరి ప్రదక్షిణను గ్రామస్థులు గురువారం చేపట్టారు. గిరి ప్రదక్షిణలో భాగంగా పాతపదేవళం కోటలో వెలసిన ఆంజనేయస్వామి లక్ష్మీ వెంకటేశ్వర, బొమ్మల నాయుడు, ఈశ్వరస్వామి, విద్య వినాయకుడు తెప్పలమ్మ అడవి పాతప్ప, అక్కమ్మ దేవతలు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వీరభద్ర... ఇలా అన్ని దేవాలయాలను దర్శించుకున్నారు. భజనలు చేసుకుంటూ గిరిప్రదక్షిణ చేశారు.



గిరిప్రదక్షిణ చేసిన భక్తులు

పత్తి కొనుగోలులో నిబంధనలు సడలించాలి



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. గుత్తి-పత్తికొండ రోడ్డుపై బైఠాయించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి ఈ క్రాప్ ఆధారంగా ప్రభుత్వం ప్రకటించిన ధరకు పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఇందులో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రేణుకా, రేవతి, మల్లేష్, చందు, రమేష్ పాల్గొన్నారు.

గోదాము తనిఖీ

గుత్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పౌర సరఫరాల శాఖ స్టాక్ పాయింట్ గోదామును జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ పుణ్యవతి, స్టాకియిస్ట్ అధికారి ఆదినారాయణ ఉన్నారు.

పొంచి ఉన్న ముప్పు!

బొమ్మనహాళ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టుకు.. రోడ్డుకు మధ్య ఇలా భారీ గుంత ఏర్పడింది. ఆ గుంతవైపు రాకుండా చుట్టుపక్కల రైతులు దానిపై ముళ్లకంపలు వేశారు. అయితే వర్షం వచ్చినప్పుడల్లా మట్టి కొట్టుకొని పోయి.. ఆ గుంత పెరుగుతోంది. ఏదైనా వాహనం ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇవ్వబోయి.. ఈ గుంతవైపు వస్తే.. ఆ రోడ్డు కుంగిపోయే ప్రమాదముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆ గుంతను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఉంతకల్లు రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

ఏళ్లు గడుస్తున్నా..!

● పూర్తికాని భవన నిర్మాణ పనులు ● ప్రజా ధనం.. నిరుపయోగం

కూడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులను ఆరేళ్ల క్రితం, వెల్‌నెస్ కేంద్రం భవన నిర్మాణ పనులను ఐదేళ్ల క్రితం నాటి వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. సచివాలయాన్ని దాదాపు రూ, 40 లక్షలు, వెల్నెస్ సెంటర్‌ను రూ, 36 లక్షలతో నిర్మించాల్సి ఉంది. అయితే నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ నిర్మాణాలూ నేటికీ పూర్తి కాలేదు. వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణం పునాదులతోనే ఆగిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ. 29 లక్షలు విడుదల చేయడంతో ఈ పనులు త్వరలోనే తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. సచివాలయ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఆగిపోయాయి. ఈ భవన నిర్మాణాలు పూర్తి చేసి.. ప్రజా ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఇప్పేరులో ఆగిపోయిన వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం



చివరి దశలో నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం

క్రైం న్యూస్..

వ్యక్తి ఆత్మహత్య



వన్నూరుస్వామి (ఫైల్)

బెళుగుప్ప, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆవులెన్న గ్రామ వాసి వన్నూరుస్వామి(44) ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను అతిగా మద్యం తాగుతూ కడుపునొప్పితో బాధపడేవాడు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లిన సమయంలో.. నొప్పి భరించలేక ఇంట్లో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తలుపులు తెరవకపోవడంతో స్థానికులు గమనించగా.. అతను ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలి పారు. వన్నూరుస్వామికి భార్య రామాంజినమ్మ, కుమార్తె పూజిత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కరిడికొండ గ్రామానికి చెందిన బాలు గాయపడ్డాడు. ఇతను గుత్తి నుంచి బైక్ పై స్వగ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పొలాల్లో కేబుల్ చోరీ

యాడికి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన గ్రామ రైతులు కుమ్మరి మధు, మోహన్ పొలాల్లోని సుమారు రూ. 30 వేల విలువైన 150 మీటర్ల కేబుల్ బుధవారం రాత్రి చోరీ అయింది. గురువారం బాధితులు మాట్లాడుతూ.. తాము బోరుబావుల కింద మొక్కజొన్న సాగు చేసుకొంటున్నామని, 20 రోజుల క్రితమే కేబుల్ చోరీ కావడంతో రూ. 30వేలు పెట్టి కొన్నామని, దాన్ని కూడా దుండగులు మళ్లీ చోరీ చేశారని వాపోయారు. ఇప్పుడు మళ్లీ కేబుల్ కొనాలని, లేకుంటే పంటలు ఎండిపోతాయన్నారు. దొంగల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రియుడిపై కేసు

పెద్దపప్పూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ యువతి, పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన ఓ యువకుడు ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా రెండు రోజుల క్రితం వివాహం చేసుకున్నారు. గురువారం తన ఇంటికి వచ్చిన ఆ యువతికి తల్లిదండ్రులు సర్దిచెప్పి ఇంటిలోనే ఉంచుకున్నారు. ప్రియుడు ఆ యువతి ఇంటివద్దకు వెళ్లి తనతో రాకుంటే చంపుతానంటూ బెదిరించాడు. ఆ యువతి ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.7200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

● బెళుగుప్ప : స్థానిక మాంగోటి చెరువువద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. వీరి నుంచి రూ. 10,250 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలుపుదల

గుంతకల్లుటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీప్రసాద్, శ్రీకృష్ణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులను గురువారం కళ్యాణదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్లప్ప, మండల వ్యవసాయ అధికారి లీనావసుందర తనిఖీ చేశారు. శ్రీకృష్ణ ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.3,78,000 విలువ చేసే 20:20 0:13 270 ఎరువుల బ్యాగులు, రూ.6,525 వేలు విలువ చేసే మెగ్నీషియం సల్ఫేట్ 87 బ్యాగుల ఎరువులకు అనుమతులు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

కళ్యాణదుర్గం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం అండేపల్లిలో వృద్ధురాలు కంసలి అనసూయమ్మ గురువారం మరణించారు. ఆమెకు వారసులు ఎవరూ లేకపోవడంతో ఎస్ఐ లోకేష్ కుమార్ తన డబ్బుతో అంత్యక్రియలు జరిపించారు.



అంత్యక్రియలో పాల్గొన్న ఎస్ఐ

తుఫాన్‌తో వరి కోతలకు బ్రేక్

బొమ్మనహాళ్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో వరి కోతలు పూర్తిగా ఆగిపోయాయి. బుధవారం రాత్రి కొద్దిపాటి వర్షం కురువడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరికోత యంత్రాలు ఎక్కడిక్కడ పొలాల్లోనే ఆగిపోయాయి. కోతలు చేయకపోయిన నిల్వ ఉన్న కూడా ప్రమాదం ఏర్పడుతుందని.. నెలకొరిగితే మరింత నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లింగదహాళ్, కొళగానహళ్లి తదితర గ్రామాల్లో వరి పంట నెలకొరిగింది. రైతులువాతావరణాన్ని గమనించి కోతలు చేపట్టాలని ఏవో సాయికుమార్ తెలిపారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు కోతలు చేయరాదని, తేమ ఎక్కువైతే రంగుమార్పు, తరిగి పోవడం సమస్యలు వస్తాయని చెప్పారు.

పాఠశాలలో గది నిర్మాణం

పెద్దవడుగూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత, భోజన హాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిదంబరరెడ్డి చొరవ తీసుకొని.. దాతల నుంచి రూ. 1.50 లక్షలు సేకరించారు. అటు తరగతులు.. ఇటు విద్యార్థులు భోజనం చేసేలా ఓ గదిని నిర్మించారు. హెచ్ఎంను ఆ గ్రామస్థులు అభినందించారు.



నూతన గదిలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా దత్త జయంతి





ఉరవకొండ: అలంకరణలో దత్తాత్రేయుడు, ఇరుముడి ధరించిన స్వాములు







శ్రీధరఘట్ట : దత్తాత్రేయస్వామి పూజలో పాల్గొన్న భక్తులు, తాడిపత్రి: అలంకరణలో దత్తాత్రేయుడు

ఉరవకొండ,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం దత్త జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే షిర్డీసాయి మాల ధరించిన స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వాములు షిర్డీకి వెళ్లారు.


● బొమ్మనహాళ్: శ్రీధరఘట్టలో శ్రీదత్త ఆశ్రమంలో దత్త జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆశ్రమంలో పల్లకిసేవా నిర్వహించారు.

● తాడిపత్రి : పట్టణంలోని శివాలయంవీధిలో ఉన్న సాయిబాబా మందిరం ఎదురుగా ఉన్న దత్తాత్రేయగుడి, సంజీవనగర్‌లో ఉన్న శివసాయి సాయిబాబా మందిరం దత్తాత్రేయ గుడిలో దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● రాయదుర్గంరూరల్: పట్టణంలోని బీటీపీ రోడ్డులో ఉన్న బొడ్రాయికి శ్రీగురుదత్తాత్రేయ జయంతి సందర్భంగా కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయికి 101 టెంకాయలు కొట్టారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక ఆలూరు రోడ్డులోని శ్రీ షిరిడిసాయి బాబా ఆలయంలో దత్త జయంతి, ఆలయ 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

● శెట్టూరు :స్థానిక షిర్డీసాయి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు.భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



రాయదుర్గం : బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న కాలనీవాసులు

సీఆర్‌ఎంటీ సమస్యలు పరిష్కరించాలి

కూడేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలోని సీఆర్‌ఎంటీ ల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓలు గౌస్‌ముద్దీన్, సాయికృష్ణకు మండలంలోని సీఆర్‌ఎంటీలు వెంకటరమణ, శివప్రసాద్, ఆదిలక్ష్మి గురువారం వినతిపత్రం అందజేశారు.

● బొమ్మనహాళ్: సీఆర్‌ఎంటీల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం సభ్యులు జిల్లా కార్యదర్శి అమరేష్ తహసీల్దార్ మునివేలు, ఎంఈఓ మల్లికార్జునకు గురువారం వినతి పత్రాలు అందజేశారు. ఇందులో సీఆర్‌ఎంటీలు భాస్కర్, రామంజనేయులు, ఇస్మాయిల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.